అంగులూరి అంజనీదేవి





# ఆరాధ్య

(నవల)

# ఆరాధ్య

## శ్రీమతి అంగులూరి అంజనీదేవి

**చరణ్ పబ్లికేషన్స్**

హన్మకొండ, వరంగల్ జిల్లా.

# AARADHYA

**(Direct Novel)**

By


**ANGULURI ANJANI DEVI**

P.B.R. Complex, H.No. 1-7-1044/2,

Up-Stair Indian Bank, Hunter Road,

Hanamkonda, Warangal Dist.

Cell: 7893555237

Emial: anguluri.anjanidevi.novelist@gmail.com

Website: www.angulurianjanidevi.com



*Published by :*

**Charan Publications**

Hanamkonda, Warangal Dist.

*First Edition :*

**October 2014**

*Price :* **Rs. 120-00**

Cover Design :

**Karunakar**

Printed at:

**CHARAN OFFSET PRINTERS**

Hanamkonda, Warangal Dist.

# అంగులూరి అంజనీదేవి
## ఇతర నవలలు

1. మధురిమ
2. నీకు నేనున్నా...
3. మౌనరాగం
4. ఈ దారి మనసైనది
5. రెండో జీవితం
6. ఎనిమిదో అడుగు
7. ఆమె అతడిని మార్చుకుంది
8. జ్ఞాపకం
9. ఇలా ఎందరున్నారు..?
10. మౌన ఘర్షణ

## కథల సంపుటి

1. జీవితం అంటే కథ కాదు!

## కవితా సంపుటి

1. గుండెలోంచి అరుణోదయం




యద్దనపూడి సులోచనరాణి మాతృమూర్తి నవలా పురస్కారం-2010ను
ప్రముఖ రచయిత్రి యద్దనపూడి సులోచనరాణి నుండి అందుకుంటున్న నవలా రచయిత్రి అంగులూరి అంజనీదేవి

# ఆరాధ్య

**క**డప నుండి వస్తున్న వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో కూర్చుని ఎంతో ఉద్విగ్నంగా ప్రయాణం చేస్తోంది ఆరాధ్య. ట్రైనెక్కినప్పటి నుండి ఆమె ఆలోచనలు ట్రైన్‌లాగే కదులుతున్నాయి. మనసు వేగంతో పోటీ పడుతున్నాయి. ఆమె చేస్తున్నది రైలు ప్రయాణం కాబట్టి చెట్లు, అడవులు, పొలాలు, కొండలు దాటి వెళ్తున్నాయి. అదే జీవిత ప్రయాణమైతే ఈ ప్రకృతి, ఈ ఆహ్లాదం ఉంటుందా?

ప్రతి ప్రయాణం వెనుక ఒక రహస్యం, ఒక అర్థం, ఒక పరమార్థం వుంటుంది. ఆ ప్రయాణ ప్రవాహంలో ఇప్పుడు కన్పించింది మళ్లీ కన్పించకపోవచ్చు. అంతవరకు చేతిలో వున్నది జారిపోనూవచ్చు. ఏదైనా ఒక అద్భుతం జరుగుతున్నప్పుడే దాన్ని గుర్తించాలి. జరిగిపోయాక గుర్తించాల్సిన అవసరం రాదు. చెయ్యగలిగినవే చెయ్యాలనుకొని ఇష్టమైనవన్నీ వదులుకుంటే జీవితమంతా రాజీయే! చర్యలనేవి ఏదో ఒకనాటికి గమ్యం చేర్చేలా ఉండకూడదు. ప్రతి చర్య ఒక గమ్యం కావాలి. ఒక ముందడుగు కావాలి. కాలం మారినా లక్ష్యాలు మారినా భావోద్వేగాలు

మారవు. ప్రోత్సహించేవాళ్లు, ప్రేరేపించేవాళ్లు లేకపోతే చాలా పనులు జరగవు. పనులు లేకపోతే ప్రయాణం వుండదు. ప్రయాణం లేకపోతే దారులు తెలియవు. దారులు తెలియకపోతే గమ్యం దొరకదు.

ఆర్యాధ్య బి.టెక్ పూర్తిచేసి ఉద్యోగాన్వేషణలో ఉంది. ఎంత చదివినా ఇంట్లోవుంటే పిలిచి ఉద్యోగాలు ఎవరూ ఇవ్వరు కదా! బయటకెళ్ళి ప్రయత్నించాలి. అప్పుడప్పుడు నెట్‌లో కూడా సర్చ్ చేసుకోవాలి. అంతేకాదు. సాఫ్ట్‌వేర్ ఫీల్డ్‌లో జాబ్స్ చెయ్యాలనకున్నప్పుడు సాఫ్ట్‌వేర్ కోర్సెస్ నేర్చుకోవాలి. వాటిల్లో సి-లాంగ్వేజ్, సి++, జావా నేర్చుకోవాలి. ఇవి కాక ఇంకా డాట్‌నెట్, షేర్‌పాయింట్, ఒరాకిల్, శాప్, మెయిన్ ఫ్రేమ్స్ కోర్సులు కూడా వుంటాయి. ఈ కోర్సులు నేర్చుకున్నా 'ఎక్స్‌పీరియన్స్ వుందా?' అని అడుగుతుంటారు. ఎక్స్‌పీరియన్స్‌కి కోర్సులు కాని, కోచింగ్ సెంటర్లు కాని లేవు.

బి.టెక్. చదువుతున్నంత సేపు ఏమీ అన్పించలేదు కాని ప్రాజెక్ట్ పూర్తయి ఇంట్లో వుండటం మొదలు పెట్టినప్పటి నుండే అసలు కష్టాలు ప్రారంభమయ్యాయి. వీధిలో తిరగాలంటేనే భయం ఆరాధ్యకి. తెలిసిన వాళ్లు ఎవరు కన్పించినా 'నీకింకా జాబ్ రాలేదా?' అనో 'నువ్వింకా జాబ్‌కి వెళ్లలేదా?' అనో అడుగుతుంటే డిప్రెషన్ పెరిగేది. 'మా అమ్మాయికి బెంగుళూరులో జాబ్ వచ్చింది. మా అబ్బాయి సాఫ్ట్‌వేర్‌లో సెటిల్ అయ్యాడు. నువ్వింకా ఇంట్లోనే వున్నావా?' అని ముఖం చూడగానే అడిగే ఆంటీలకి జవాబు చెప్పలేకపోయేది.

ఆరాధ్య తల్లి రమాదేవిలో కూడా మార్పు వచ్చింది. ఒకప్పుడైతే "హైదరాబాదు వెళ్లి అంత రష్‌లో ఏం జాబ్ చేస్తావే! అంత అవసరమా?" అనేది.ఇప్పుడలా లేదు. సూటిపోటి మాటలు మాట్లాడితే ఆరాధ్యకి అర్థం కాదని డైరెక్ట్‌గానే "ఆరాధ్యా! టీవీ చూస్తూ ఎంతసేపు కూర్చున్నా అదేమైనా జాబ్ చూపెడుతుందా? హైదరాబాదు వెళ్లరాదూ! ఏదో ఒక జాబ్ వస్తుంది" అంది. ఈ మధ్యన రమాదేవి ధ్యాసంతా స్వీట్‌హౌజ్ మీద కన్నా రిమోట్ పట్టుకొని టీ.వీ. ముందు కూర్చుని వుండే కూతురు మీదనే వుంది. స్వీట్‌హౌజ్ వాళ్లు వుండే ఇంటిపక్కనే రోడ్డుమీదకి కన్పిస్తూ వుంటుంది. వాళ్ల పూర్వీకులు కూడా అదే వ్యాపారం చేస్తూ జీవించారు.

ఆరాధ్య తన చేతిలో వున్న రిమోట్‌ని పక్కనపెట్టకుండా అలాగే పట్టుకొని "జాబ్స్ దొరకటం అంత ఈజీ అనుకుంటున్నావా మమ్మీ! బయట హెవీ కాంపిటీషన్ వుంది" అంది.

"పోటీ లేనిది ఎక్కడ? అలా అని ఏ ప్రయత్నం లేకుండా ఇంట్లోనే వుంటావా?"

"బయటకెళ్లి ఆ పోటీని తట్టుకోవడం అంత సులభం కాదు. ఆపర్చునిటీస్ బాగా తగ్గాయి"

"నీతో చదివిన వాళ్లంతా జాబ్స్ చేస్తున్నారు. ఆపర్చునిటీస్ లేకుంటే వాళ్లెలా చేస్తున్నారు"

"ఎంత చెప్పినా నీకు అర్థం కాదని నాకు తెలుసు. అలాంటప్పుడు ఎంత చెప్పినా వేస్టే మమ్మీ!"

"అలా అని ఇంట్లోనే వుంటావా? ఇలా టీవీ చూస్తూ..." అని రమాదేవి అనగానే

చేతిలో వున్న రిమోట్‌ని పక్కనే వున్నబెడ్ మీదకి విసిరికొట్టింది ఆరాధ్య.

ఆరాధ్యకి వచ్చిన కోపాన్ని చూసి ఏమాత్రం చలించకుండా అలాగే నిలబడి "నువ్వు బి.టెక్ చదివావనే కాని కొంచెం కూడా బాధ్యత లేదు. అసలు బాధ్యతగా ఆలోచించటం కూడా రాదు నీకు. అలాంటప్పుడు నేనేం చెప్పాలి? నీవేమైనా ఇంకా చిన్నపిల్లవా?" అని అనేలోపే

అక్కడి నుండి లేచి విసురుగా బయటకెళ్లబోయింది ఆరాధ్య.

"ఆగు. తప్పించుకోవడం సమర్థత కాదు. ఇలా ఎన్నిరోజులు? ఇంటికి పెద్దదానివి. చదువు అయిపోయి ఖాళీగా వుంటే తమ్ముడ్ని ఎవరు చదివిస్తారు?"

"మీరంతా వున్నారుగా తమ్ముడికి... నేను చదివించటం ఏమిటి మమ్మీ? అయినా తమ్ముడ్ని చదివిస్తానని నేనేమైనా మీకు చెప్పానా?"

"నువ్వు చెప్పినా చెప్పకపోయినా ఇప్పుడు మనం వున్న ఈ పరిస్థితిలో తమ్ముడ్ని నువ్వే చదివించాలి"

"అబ్బా! తమ్ముడి విషయం పక్కనపెట్టి మాట్లాడు మమ్మీ!"

"మరి ఇంకేం మాట్లాడాలి?"

"బి.టెక్ అయిపోయిందన్న మాటేగాని నాకు ఒక్క కోర్సులోనైనా కోచింగ్ ఇప్పించారా? హైదరాబాదు పంపించారా? ఇప్పుడేదో ఇలా అంటున్నావు గాని నాతో చదివినవాళ్లంతా ఎక్కడున్నారో! ఎలా వున్నారో! వాళ్లు అలా వుండేముందు ఏఏ కోచింగులు తీసుకున్నారో అడిగి తెలుసుకున్నావా? నేను చెప్పినా వినేదానివి కాదు. అసలు నా గురించి ఆ ఆలోచనే లేదు. ఇక టి.వి. చూస్తూ ఇంట్లో వుండక ఇప్పుడు నన్నేం చేయమంటావు?"

"మరిప్పుడు వెళ్తావా? కోచింగ్ తీసుకుంటావా? అయితే ఎక్కడో ఓచోట అప్పుచేసి డబ్బులు తెస్తాను" అంది రమాదేవి.

ఆరాధ్య మాట్లాడలేదు.

"చెప్పవే! మౌనంగా వుండి నీ ఫ్యూచరెందుకు పాడుచేసుకుంటావు? నీమీద ఇంత పెట్టాం! ఆకాస్త పెట్టలేమా?"

"ఇప్పుడు నువ్వు పెట్టేది నా ఫ్యూచర్ కోసమా? లేక తమ్ముడి చదువుకోసమా?"

"నాకు ఇద్దరూ ముఖ్యమే! మేము ఏం చేసినా మీకోసమేగా!"

"మరి అప్పు ఎందుకు చెయ్యటం? ఇంట్లో డబ్బులున్నాయిగా!"

"డబ్బులున్నాయా? డబ్బులెక్కడివి?"

"డాడీ, నువ్వు రాత్రి లెక్కపెట్టి బీరువాలోపెట్టడం నేను చూడలేదనుకుంటున్నావా?"

"అవి నీకోసం కాదు ఆరాధ్యా! తమ్ముడి కోసం. తమ్ముడు ఇప్పుడు బి.టెక్ ఫైనలియ్యర్. అందులో అది పేమెంట్ సీటు. ఫైనల్ ఇయర్‌కి కట్టాల్సింది కట్టాలి కదా!" అంది.

"అర్థమైంది మమ్మీ! మీ కాన్‌సన్‌ట్రేషన్ మొత్తం తమ్ముడి మీదనే వుంది. అందుకే నేను అడిగినప్పుడు నాకు డబ్బులివ్వలేదు. అంతేకాదు మీరు నన్ను తమ్ముడ్ని చేర్పించినంత మంచి కాలేజీలో కూడా చదివించలేదు. ఏదో బి.టెక్. చేయించామంటే చేయించారు. అంతే!"

మాట్లాడలేకపోయింది రమాదేవి. బి.టెక్ చదివిస్తే మంచిదనుకున్నారే కాని అందులో కూడా మంచివి, మంచివి కాని కాలేజీలు వుంటాయన్నది ఆమెకు తెలియదు. ఎందులో చదివితే తక్కువ ఖర్చు వస్తుందన్నదే చూశారు. అక్కడే చదివించారు.

తల్లి మౌనంగా వుండటం చూసి "మనం చదివే కాలేజీని బట్టి కూడా ఉద్యోగాలు వస్తాయి మమ్మీ! అప్పుడలా ఆలోచించే సునీల్‌ని అంత మంచి కాలేజీలో చేర్పించారు.

"నువ్వు అర్థం చేసుకోకుండా ఇలా మాట్లాడితే నేనేం చెయ్యను ఆరాధ్యా?"

"నువ్వు చెయ్యాల్సింది ఏమీలేదు మమ్మీ! నేను అర్థం చేసుకోలేనిది కూడా ఏమీలేదు. మీరు నాకోసం అప్పులేం చెయ్యనవసరం లేదు. ఇప్పటికే నామీద పెట్టింది చాలు. ప్రతిరోజు నువ్వూ, నాన్న నా విషయంలో ఎంత గొడవ పడుతున్నారో నేను వింటూనే వున్నాను. అయినా తప్పక చచ్చినట్లే ఈ ఇంట్లో పడి వున్నాను చూడు అందుకు నన్ను నేను తిట్టుకోవాలి. ముందు నాకసలు ఆత్మాభిమానం లేదు"

"అలా అనకు ఆరాధ్యా! నేనూ, నాన్నా నీకేమైనా పరాయివాళ్లమా?"

ఆరాధ్య మాట్లాడకుండా ఆలోచిస్తోంది.

"ఏంటే ఆలోచిస్తున్నావ్?" వెంటనే అడిగింది రమాదేవి.

"ఏం లేదు. నా ఉద్యోగ ప్రయత్నాలేవో నేను చేసుకుంటాను" అంది ఆరాధ్య. ఆమెలో కసి పెరిగింది.

"ఎలా చేసుకుంటావే?"

"నాకు మాత్రం తెలుసా! ప్రయత్నిస్తాను" అంటూ ఇంకేం మాట్లాడకుండా బయటకెళ్లింది ఆరాధ్య.

ఆ రాత్రికే ఫ్రెండ్‌కి ఫోన్ చేసింది.

అతను 'హలో!' అనగానే "నేను ఈ ఇంట్లో వుండలేకపోతున్నాను రాకేష్! నాకు జాబ్ కావాలి" అంది.

"జాబా! హైదరాబాదు రాలేనని నువ్వేగా అన్నావ్! పైగా మా ఇంట్లోవాళ్లు అంతదూరం పంపించరని కూడా అన్నావ్!"

"అన్నాను. కానీ..."

"కానీ లేదు. ఏం లేదు. హాయిగా తిని ఇంట్లో కూర్చో. ఇప్పుడంతవసరం ఏమొచ్చింది?" అంటూ నవ్వాడు.

"నేనింత సీరియస్‌గా అడుగుతుంటే నీకు నవ్వెలా వస్తుంది? ఇప్పుడు నేనెంత బ్యాడ్ పొజిషన్లో వున్నానో నీకు తెలుసా?"

"నీ పొజిషన్ బ్యాడా?" అంటూ మరింత ఆశ్చర్యపోయాడు రాకేష్.

"అవును రాకేష్! నీకెలా చెప్పాలో అర్థం కావడం లేదు"

"నువ్వెలా చెప్పినా అర్థం చేసుకుంటాను. కానీ ఇప్పుడు కాదు. నేనిప్పుడు నిద్రపోయే మూడ్‌లో వున్నాను. రేపు కాల్ చెయ్యవా ప్లీజ్!" అంటూ కాల్ కట్ చేశాడు.

మళ్లీ కాల్ చేసింది ఆరాధ్య.

రాకేష్ లిఫ్ట్‌చేసి "ఇప్పటికిప్పుడు జాబ్ అంటే అంత ఈజీ అనుకుంటున్నావా?"

"అప్పటి పరిస్థితులు వేరు. ఇప్పుడున్న ఈ పరిస్థితులు వేరు. అయినా నేను నీకన్నా టూ ఇయర్స్ సీనియర్ని. అప్పటికీ, ఇప్పటికీ సాఫ్ట్‌వేర్ రంగంలో చాలా మార్పులు వచ్చాయి"

"మార్పులు ఎప్పుడు వస్తూనే వుంటాయి. మార్పులు వచ్చినంత మాత్రాన ఎవరూ జాబ్స్ చెయ్యట్లేదా? ఇప్పుడు నా బ్యాచ్‌వాళ్లు కూడా బయటకెళ్లి జాబ్స్ చేస్తున్నారు. నేనే ఇంట్లో వుండి రోజూ మా మమ్మీచేత తిట్లు తింటున్నాను" అంది ఆరాధ్య.

అవతలి వైపు నుండి ఎలాంటి సమాధానం లేదు.

"మాట్లాడవేం రాకేష్?"

"ఏం మాట్లాడను ఆరాధ్యా? నేనేం మాట్లాడినా నీకు అర్థం కాదు. ఎందుకంటే నీకు జాబ్ కావాలి. అదే వుంది నీ మైండ్‌లో... అఫ్‌కోర్స్ ఎవరైనా నీలాగే ఆలోచిస్తారనుకో!"

"అంటే! నాకు జాబ్ రాదంటావా?"

"వస్తుంది. ఎందుకు రాదు. తొందరపడొద్దంటున్నాను"

"నేనేం తొందర పడటం లేదు. ఇప్పటికే ఆలస్యం అయింది"

"నువ్వలా అనుకుంటే నేనేం చెయ్యలేను. ఇక్కడ కొంతమంది బి.టెక్ చేసినవాళ్లు సరైన జాబ్స్ లేక నాలుగు వేలకి, ఐదువేలకి రిసెప్షనిస్టులుగా నెలంతా వర్క్ చేస్తున్నారు. అంత బ్యాడ్‌గా వుందిక్కడ. అందుకే ఒక ఫ్రెండ్‌గా నేను నీకిచ్చే అడ్వయిజ్ ఏంటంటే నువ్విక్కడికి రావద్దు"

"నువ్వసలు నా ఫ్రెండ్‌వే కాదు" అంటూ కాల్ కట్‌చేసింది.

రాకేష్ వెంటనే ఆరాధ్యకి కాల్ చేశాడు.

ఆరాధ్య ముఖం అదోలా పెట్టుకొని కాల్ లిఫ్ట్ చేసి "ఊ... చెప్పు!" అంది.

"అర్థం చేసుకోకుండా కాల్ కట్ చేస్తావెందుకు? నీకేమైనా మెంటలా..."

"మరేం చెయ్యాలి రాకేష్?"

"ఆరాధ్యా! నేను ఏది చెప్పినా నీ మంచికే చెబుతానని నువ్వెందుకనుకోవు?"

"నువ్వేం చెబుతావో నాకు తెలియదు. నాకు మాత్రం జాబ్ కావాలి"

"ఇక్కడ సాఫ్ట్‌వేర్ కోర్సెస్ నేర్చుకున్నవాళ్లకే జాబ్స్ రావటం లేదు"

ఆరాధ్య మౌనంగా వుండటంతో అతను మరింత ఎక్స్‌ప్లెయిన్ చెయ్యాలనుకుని "నేనిక్కడ జావా నేర్చుకునేటప్పుడయితే ఒక క్లాసుకి మూడు వందల నుండి నాలుగు వందల వరకు స్టూడెంట్స్ అటెండయ్యేవాళ్లు. ఫేకల్టీ బాగుందనిపిస్తే ఏడు వందలమంది స్టూడెంట్స్ వరకు అటెండయ్యే వాళ్లు. అక్కడ లెక్చరర్స్ ఎల్.సి.డి. ప్రొజెక్టర్ పెట్టుకొని మైకుల్లో క్లాసులు చెబుతుంటారు. ఒక్క అమీర్‌పేటలోనే రెండు వందల వరకు సాఫ్ట్‌వేర్ కోర్సెస్ నేర్పే ఇన్సిట్యూట్స్ వున్నాయి. అందులోంచి వందల మంది కోర్సెస్ నేర్చుకొని బయటకొస్తున్నారు. ఎంతమందికని జాబ్స్ వస్తాయి. ఇలా చెప్పుకుంటూ పోతే ఇంకా చాలా వున్నాయి"

"అవికూడా చెబుతావా?" వ్యంగ్యంగా అడిగింది.

"అంత వ్యంగ్యంగా మాట్లాడటం అవసరమా ఆరాధ్యా?"

"అయినా నేనెవర్ని రాకేష్! నీతో మాట్లాడటానికి?"

"ఉన్న ఫ్రెండ్స్‌లో చాలా దగ్గర ఫ్రెండ్‌వి కదా!"

"అయితే ఫోన్ పెట్టెయ్యనా?" అంది ఆరాధ్య.

"కోపమా?"

"నాకెందుకు కోపం రాకేష్?"

"హైదరాబాదు రావద్దంటున్నాను కదా!"

"నా కోపం అందుకు కాదు. నువ్వు ఆల్‌రెడీ సాఫ్ట్‌వేర్ జాబ్‌లో వున్నావు. నీ రెఫరెన్స్‌తో నాకు జాబ్ ఇప్పించలేవా?"

"ఒక్క నా రిఫరెన్స్ సరిపోదు. కొన్ని కంపెనీస్‌లో డబ్బుకూడా అవసరం అవుతుంది. దానికి మనం రెడీగా వుండాలి"

"డబ్బా!!" అని ఉలిక్కిపడింది ఆరాధ్య.

"అవును. డబ్బే! హైదరాబాదు రావాలీ అంటే డబ్బు సిద్ధం చేసుకొనిరా! నువ్వు ఇక్కడికి వచ్చాక నా ప్రయత్నం నేను చేస్తాను"

"డబ్బంటే కొంచెం కష్టమే రాకేష్! మాకుండే స్వీట్‌హౌజ్ ఇప్పుడు సరిగా నడవటం లేదు. మా పక్కనే ఇంకో రెండు స్వీట్‌హౌజ్‌లు పెట్టడంతో పోటీ పెరిగింది. గిరాకీ తగ్గింది"

"అయినా ఇన్నిరోజులు సంపాయించింది వుందిగా!"

"మొత్తం పోయింది. మా ఇంట్లో దొంగలు పడ్డారు"

"అవునవును ఒకసారి చెప్పావు గాని ఎంత పట్టుకెళ్లింది వివరాలేం చెప్పలేదు"

"కానీ పట్టుకెళ్లింది మా డబ్బే అయితే ఇంత లాస్ అయ్యేవాళ్లం కాదు. అసలు ఆరోజు మా ఇంట్లో మాకు సంబంధించిన డబ్బుకాని, బంగారం కాని ఏమీ లేదు. రెండు రోజులు బ్యాంకుకు సెలవు రావటంతో మా పక్క ఇంటివాళ్లు టూర్‌కి వెళ్తూ మా ఇంట్లో కొంత డబ్బును దాచుకొని వెళ్లారు. వాళ్లు తిరిగి వచ్చాక దొంగలు పడ్డారని చెప్పినా నమ్మకుండా మొత్తం మాచేత కట్టించుకున్నారు"

"మరి బంగారం?"

"బంగారం కూడా మాదికాదు. మేం వడ్డీలకి డబ్బులిచ్చిన వాళ్ల దగ్గర నుండి నమ్మకం కోసం వాళ్ల బంగారు నగలు తీసుకొని మా ఇంట్లో

వుంచుకున్నాం... అవి పోయాయి. ఇప్పుడున్న బంగారం రేట్లను బట్టి క్యాలిక్యులేట్ చేస్తే మేమే వాళ్లకు బాకీ తేలాం. బయట అప్పు తెచ్చి కట్టాం!"

అంతా విని "మైగాడ్!" అన్నాడు రాకేష్.

"అందుకే రాకేష్! నాకేదైనా అవసరమైతే ముందు నువ్వు డబ్బులు పెట్టినా నాకు జాబ్ వచ్చాక నీకిచ్చేస్తాను. నాకున్న ఫ్రెండ్స్‌లో నువ్వేగా బెస్ట్‌ఫ్రెండ్‌వి. నన్ను నమ్మవా?"

"ఛ...ఛ... నిన్ను నమ్మకపోవడం ఏమిటి?"

అంతలో రమాదేవి అటువైపు వెళ్తూ "ఎవరితో మాట్లాడుతున్నావే! రాకేష్ అంటున్నావ్! అబ్బాయా?" అని అడిగింది.

ఒక్కక్షణం ఏం చెప్పాలో తోచక ఆగింది ఆరాధ్య. ఆతర్వాత చెవి దగ్గర వున్న మొబైల్‌ని తియ్యకుండానే కాస్త దూరంగా వున్న తల్లివైపు చూస్తూ "రాకేష్ కాదు మమ్మీ! రాక్షసి అంటున్నా! అబ్బాయి కాదు అమ్మాయే! దాన్ని మేమంతా రాక్షసి అని పిలుస్తుంటాం!" అంటూ అబద్ధం చెప్పింది.

ఆమె విని వెళ్లిపోయింది. అబ్బాయిలతో స్నేహమంటే రమాదేవి వూరుకోదు. అసలు అబ్బాయిలతో స్నేహాలు ఏర్పడతాయనే ఆరాధ్యను బయట ఊర్లలో వుండే కాలేజీలలో చదివించకుండా ఇంటికి మూడు కిలోమీటర్ల దూరంలో వుండే కాలేజీలోనే చేర్పించుకుంది. దానివల్ల ఖర్చులు తగ్గుతాయని, స్నేహాలు కూడా ఏర్పడవని...

రాకేష్ లైన్లో వుండటంతో "సరే! రాకేష్! నన్ను హైదరాబాదు ఎప్పుడు రమ్మంటావ్?" అని అడిగింది ఆరాధ్య. ఆమెకు తల్లితో గొడవ పడలేక ఎప్పుడెప్పుడు హైదరాబాదుకి వెళ్దామా అనివుంది.

"ఎప్పుడంటే! రేపేరా ఆరాధ్య!" అన్నాడు రాకేష్.

"రేపే అంటే వీలవుతుందో లేదో! రేపు మా డాడి, మా మమ్మీ మా తమ్ముడు సునీల్‌ని కలవటానికి మద్రాసు వెళ్తున్నారు. వాళ్లు వచ్చాక రానా?"

"అవసరం లేదు. వాళ్లు అటు వెళ్తారు. నువ్వు ఇటు రా!" అన్నాడు.

ఆరాధ్య హ్యాపీగా "ఓ.కె. రాకేష్! థ్యాంక్యూ! బై!" అంటూ ఫోన్ కట్‌చేసి రేపటి తన ప్రయాణం గురించి ఆలోచించుకుంటూ నిద్రపోయింది.

* * * * *

# End of Preview.

# Rest of the book can be read @

**http://kinige.com/book/Aaradhya**

* * *